క్లుప్తంగా

389 బేళ్లు తిరస్కరణ


టంగుటూరులో వేలం

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 356 బేళ్లు తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. నాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1013 బేళ్లను తీసుకురాగా 624 బేళ్లను కొనుగోలుచేశారు. గరిష్ట ధర రూ.282, కనిష్ట ధర రూ.150, సరాసరి ధర రూ.213.12గా నమోదైంది. వేలంలో 24 కంపెనీలు పాల్గొన్నాయి.

356 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 356 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని నర్సింగోలు, కట్టవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 892 బేళ్లను తీసుకురాగా 536 బేళ్లను కొనుగోలుచేశారు. గరిష్ట ధర రూ.282, కనిష్ట ధర రూ.155, సరాసరి ధర రూ.231.99గా నమోదైంది. వేలంలో 25 కంపెనీలు పాల్గొన్నాయి.

బీసీ హాస్టల్‌లో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు


ఫ్రెషర్స్‌డే వేడుకల్లో మాట్లాడుతున్న కదిరి పార్థసారథి

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని శీలంవారిపల్లె బీసీ బాలికల వసతిగృహంలో ఫ్రెషర్స్‌డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేడుకల్లో పాల్గొన్న కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారది మాట్లాడుతూ వసతిగృహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నలక్ష్యాలను ఎంచుకుని ఆ లక్ష్యాల సాధనదిశగా విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కేబీఆర్ విద్యాసంస్థల డీన్ వీరన్నగౌడ్, టి.బాబూరావు, మాజీ ఎంపీటీసీ మూరం కాశిరెడ్డి, నిమ్మల శ్రీనివాసులు, ఇరగలి మాధవరావు, కన్నయ్య, ప్లస్ కళాశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఐద్వా అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక


షేక్.మస్తానమ్మ


కే.ధనలక్ష్మి

పామూరు: ఐద్వా అధ్యక్షురాలిగా షేక్.మస్తానమ్మ, ప్రధాన కార్యదర్శిగా కొమ్మలపాటి ధనలక్ష్మిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐద్వా పామూరు కమిటీ ఎన్నిక బుధవారం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా షేక్.మదారమ్మ, సహాయకార్యదర్శిగా భానుమతి, ట్రెజరర్‌గా ఖాదరున్నీసాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేత


విద్యార్థులకు వీల్‌చైర్ అందజేస్తున్న ఎంఈఓలు

పీసీపల్లి: మండల పరిధిలోని స్థానిక గోపవరపు వారిపల్లి భవితా కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు వీల్‌చైర్‌ను ఎంఈఓ ఆర్ శ్రీనివాసచారి, సంజీవులు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గురువారెడ్డి నాగేశ్వరావు విద్యార్థులు ఉపాధ్యాయులు ఉన్నారు

చుండూరు మృతవీరులు, గద్దర్‌కు నివాళులు


నివాళులర్పిస్తున్న అశోక్, నాయకులు

టంగుటూరు: మాల ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద చుండూరు మృతవీరులకు, ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు మాట్లాడుతూ అగ్రవర్ణాలు 8 మంది దళితులను అత్యంత కిరాతకంగా చంపడం దారుణమన్నారు. అదే విధంగా ప్రజా యుద్ధనౌక గద్దర్‌కి నివాళులర్పించారు. దాసరి చెన్నకేశవులు, క్రాంతిరాజు గౌతం, బ్రహ్మయ్య, ఆర్తి, దళిత ప్రజా సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

టంగుటూరు: అనంతవరం పంచాయతీ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని అనంతవరం పంచాయతీలోని పసుకుదురు గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అనంతవరం పంచాయతీ పరిధిలోని నిధులు జంగిల్ క్లియరెన్సు చేయకుండానే రూ.1.49 లక్షలు అధికారులు, నేతలు దోచేశారని తెలిపారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే నాయకులు గ్రామంలోకి వచ్చినప్పుడు లక్షలు లక్షలు ఖర్చు చేశామని, ఆ డబ్బులు ఎలా వస్తాయని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

శివారు కాలనీలు.. సమస్యల నిలయాలు..

- అధ్వానంగా పారిశుధ్యం
- కన్పించని సీసీ డ్రైన్‌లు, కచ్చా డ్రైన్‌లు
- కాలనీల్లో కన్నీటి ఘోష
- పట్టించుకోని అధికార గణం

కనిగిరిరూరల్:

స్థాయి మారుతున్నా.. కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధి తదనుగుణంగా జరగడం లేదు. నేతలెందరు మారినా.. తమ రాత మారలేదులే అన్న చందనా.. విలీన గ్రామ ప్రజలు కన్నీటి ఘోష పెడుతున్నారు. కనీస మౌలిక వసతులు కరువై అల్లాడుతున్నారు.

మున్సిపాలిటీగా మారినా..

కనిగిరి పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మారింది. నగర పంచాయతీ నుంచి గ్రేడ్ 2 మున్సిపాలిటీగా మారింది. అయినా తగిన సిబ్బంది కొరత, నిధులు కేటాయింపులు లేకపోవడంతో సమస్యలు తాండవిస్తున్నాయి.

విలీన గ్రామాల్లో సౌకర్యాలు మృగ్యం

శరవేగంగా పెరుగుతున్న కనిగిరి మున్సిపాలిటీ సుమారు 49.30 కి.మీల దూరం విస్తరించింది. ప్రధాన కనిగిరి పట్టణంలో కాశీపురం, చింతలపాలెం, శంఖవరం, మాచవరం పంచాయతీలు కలవడంతో 20 వార్డులుగా రూపాంతరం చెందింది. ప్రధానంగా పట్టణానికి అనుకుని ఉన్న దేవాంగనగర్, కాశిరెడ్డి కాలనీల్లో ఏ వీధి చూసినా ఏముంది గర్వకారణం అధ్వాన్న పారిశుధ్యం..వేధిస్తున్న నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. టకారిపాలెం, దేవాంగనగర్‌లోని మిని ట్యాంకుల్లోకి నీరు పంపింగ్ లేక అధికారుల తీరును వెక్కిరిస్తున్నాయి. కాశీపురం, దేవాంగనగర్‌లోని ఓహెచ్ ఆర్ ట్యాంక్‌లు పరిశుభ్రతకు నోచుకుంటే ఒట్టే. సీసీ డ్రైన్‌లు లేకపోవడంతో పాఠశాలలు, అంగన్ వాడీ స్కూల్ పక్కనుంచే మురికి నీటి కాలువ ప్రవహిస్తూ.. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీంతో తమ పిల్లలకు ఎక్కడ రోగాలు వస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాశిరెడ్డి కాలనీ, కాశీపురాన్ని కష్టాలు కౌగిలించుకుని ఉన్నాయి. గ్రామంలోని వీధులు, ప్రధాన రహదారులు పిచ్చి చెట్లతో మూసుకుని పోయాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


శంఖవరంలో రోడ్డుపై పారుతున్న మురికి నీరు

వార్డులు: 20
జనాభా: 5,755
పారిశుధ్య కార్మికుల సంఖ్య: 89

చింతలపాలెం, శంఖవరం గ్రామాల్లో సమస్యల చింత

ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలు అధికంగా నివసించే ఈ గ్రామాల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. పారిశుధ్యం అధ్వాన్నంగా మారి కాలువల్లో మురికి నీరు కదలని పరిస్థితి. గ్రామంలోని రెండు ప్రధాన ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు ఏళ్ల కాలం నుంచి కడిగితే ఒట్టు. విస్తరించిన ముస్లిం కాలనీలో కనీస సౌకర్యాలు మృగ్యం. సీసీ డ్రైనేజీ కాలువలు లేక రోడ్లపైనే నీరు ప్రవహిస్తున్నాయి.

గడ్డమీదపల్లిలో గంపెడు సమస్యలు..

పట్టణానికి 2 కిలోమీటర్ల దూరంలో ఎస్సీ సామాజిక వర్గాని ప్రజలు నివసించే గడ్డమీదపల్లి గ్రామవాసులు గంపెడు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. కాలనీలో సుమారు 60 గృహాలు, 130కి పైగా ఓట్లు ఉన్నాయి. కనిగిరి కందుకూరు ప్రధాన రహదారి చింతలపాలెం జెండా చెట్టు వద్ద నుంచి లింకురోడ్డు చిల్ల చెట్లతో మూసుకుని పోయింది. గ్రామంలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో సుమారు అరకిలో మీటరుకు పైగా నడిచి వచ్చి సాగర్ నీటిని పట్టుకుని వెళ్లాల్సి పరిస్థితి. వర్షం వస్తే రోడ్డు అధ్వాన్నంగా ఉంటుంది. దీంతో ప్రజలు పడే అవస్థలు వర్ణణాతీతం.


మాచవరంలో... మోయలేనన్నీ సమస్యలు:

మాచవరంలో ప్రధానంగా నీటి సమస్య వెంటాడుతోంది. బోర్‌వెల్స్ సక్రమంగా పనిచేయకపోవడంతో మాచవరం ప్రధాన గ్రామంతో పాటు, బీసీ, ఎస్సీ కాలనీ వాసులు అల్లాడుతున్నారు. సుమారు 2 వేల జనాభ కల్గిన 6 వ వార్డుల్లో ప్రజలు అనే ఇబ్బందులు పడుతున్నారు. అలాగే విస్తీర్ణం చెందిన విశ్వబ్రహ్మణ కాలనీలో కనీస మౌలిక వసతులు మృగ్యం. కొన్ని స్తంభాలకు వీధిలైట్లు కూడా వేయలేదు. అంతర్గత రోడ్డు, సీసీ డ్రైన్లు లేక ప్రజలు అల్లాడుతున్నారు.


దేవాంగనగర్ ఒట్టిపోయిన మిని నీటి ట్యాంక్ ఇదే


చిల్లచెట్లతో మూసుకుపోయిన గడ్డమీదపల్లి ప్రధాన రోడ్డు


పాఠశాల, అంగన్‌వాడీ స్కూల్ మధ్య పారుతున్న మురుగు నీరు


మినీ ట్యాంక్‌లకు కుళాయిలు లేక కారుతున్న నీరు

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం


స్వామి కళ్యాణోత్సవం

కనిగిరిరూరల్: మండలంలోని చాకిరాలలో సీతారాముల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం వైభవంగా సాగింది. నూతనంగా నిర్మించిన రామాలయంలో జరిగిన ప్రతిష్ఠకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం వేద పండితులు రామి నూతల రమేష్‌శర్మ శిఖర కలశాలకు మహా కుంభాభిషేకం నిర్వహించారు. సీతారాముల కళ్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల్లో దేవస్థానం కమిటీ నిర్వాహకులు, కేటీఆర్ విద్యా సంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి దంపతులు, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విశిష్ట పూజలు చేశారు. దేవకి వెంకటేశ్వర్లు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, సాయిబాబా దేవస్థానకమిటీ అధ్యక్షుడు కోప్పరపు సత్యాలు, సద్గురు సాయి సేవా సమితి అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, రాచపుడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో భక్తులు

తంగెళ్ల పాఠశాలకు బీరువా వితరణ

మర్రిపూడి: మండంలోని తంగెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బీరువా అందజేశారు. కొండపి మండలం పెదకండ్లగుంట హైస్కూల్లో ఇంగ్లిష్ సహ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ తన తండ్రి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం పాఠశాలకు అందజేశారని ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం దాత చంద్రశేఖర్‌ను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా సన్మానించారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడికి ఖండన

కనిగిరిరూరల్: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో బీసీ నేత, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ నేత వేల్పుల రాముతో పాటు మరికొందరిపై టీడీపీ శ్రేణులు దాడి చేయడాన్ని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓడిపోతారనే భయంతోనే వైఎస్సార్ సీపీ నాయకులపై దాడికి పాల్పడ్డారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని దద్దాల ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి రెడ్ బుక్ పాలన చేస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. బీసీ వర్గానికి చెందిన రమేష్ యాదవ్‌పై దాడికి దిగడాన్ని తీవ్రంగా ఖండించారు. ఒక శాసన మండలి సభ్యుడికి పోలీసులు కనీస రక్షణ, భద్రత కల్పించక పోవడాన్ని గట్టిగా ప్రశ్నించారు. పులివెందులలో శాంతి భద్రతలను కాపాడేందుకు ఎన్నికల కమిషన్ తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టంగుటూరు: బీసీ నేత, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గుండాలు దాడి చేయడాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొట్ల రామారావు తీవ్రంగా ఖండించారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. దాడిని ఖండిస్తూ అన్ని ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని కోరారు.

కొండపి: వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గుండాల దాడి అత్యంత హేయమైన చర్య అని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వీర వసంతరావు ఒక ప్రకటనలో ఖండించారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఇలాంటి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. రమేష్ యాదవ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో బీసీలంతా ఏకమై ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

మాజీ మంత్రి కాకాణిని పరామర్శించిన ఆదిమూలపు


మాజీ మంత్రి కాకాణిని పరామర్శించి బయటకు వస్తున్న ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుల నమోదుతో నెల్లూరు జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు సురేష్ మాజీ మంత్రి కాకాణి నివాసానికి వెళ్లి ఆయన కుమార్తెతో పూజితతో మాట్లాడారు. నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ బుధవారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ, పారిశుధ్యం, సౌకర్యాలు, నీటి వసతి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థినులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి శానిటరీ ప్యాడ్స్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. హాస్టల్ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని బీసీ వెల్ఫేర్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడుతామని చెప్పారు. హాస్టల్‌లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండి దుర్వాసన వస్తుండటంతో తక్షణ చర్యలుగా మున్సిపల్ సిబ్బందిని పిలిపించి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చైర్మన్ గఫార్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పరిసరాలు పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 2వ వార్డు శివనగర్ కాలనీలో బుధవారం చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అపరిశుభ్రత వాతావరణం వలనే దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి రోగాలు విజృంభిస్తాయన్నారు.

పీ-4 పథకంతో పేదలకు బంగారు భవిష్యత్

సింగరాయకొండ: పేదలకు బంగారు భవిష్యత్ కల్పించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పీ-4 విధానాన్ని అమలు చేస్తుందని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 పథకం అమలుపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో 11,122 మంది బంగారు కుటుంబాలు, 735 మార్గదర్శకులను గుర్తించగా మండలంలో 2,464 బంగారు కుటుంబాల వారిని 43 మందిని మార్గదర్శకులను గుర్తించామన్నారు. ఉద్యోగస్తులు, టీచర్లు బంగారు కుటుంబాల బాధ్యత తీసుకునేది లేనిది వారి ఇష్టమని, ఇందులో బలవంతం ఏం లేదన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ జీవీ కృష్ణారావు, ఈఓఆర్‌డీ ఆర్ రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్‌రెడ్డి

యాజమాన్య పద్ధతులతో మేలు


అవగాహన కల్పిస్తున్న జిల్లా వనరుల కేంద్రం అధికారి శేషమ్మ

పొన్నలూరు: వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు జరుగుతుందని ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వీపీ శేషమ్మ అన్నారు. మండలంలోని మాలపాడు పంచాయతీలో బుధవారం పలు వ్యవసాయ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు నూతన వ్యవసాయ పద్ధతులను తెలియజేయాలన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు పంటలను సాగు చేయాలన్నారు. జీవన ఎరువుల ప్రాముఖ్యతపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏడీఏ నిర్మలాకుమారి, ఏఓ రాము, వ్యవసాయ సహాయకులు నరసింహ సాయి, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

సీఎస్‌పురం(పామూరు): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అన్నారు. మండలంలోని పెదరాజుపాలెంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. హెచ్‌ఎం శివప్రసాద్, ఉపాధ్యాయురాలు భార్గవి తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పురిటి పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని సీడీపీఓ పి.లావణ్య, ఎంపీపీ గంగసాని లక్ష్మి, తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావు, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో బుధవారం జాతీయ తల్లిపాల వారోత్సవాలు సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉంటుందన్నారు. బాల్యవివాహాల వల్ల అనర్థాలు వివరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రుబీనా, ఎస్‌జీఓ డాక్టర్ నాయబ్‌రసూల్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపి: మండలంలోని పోలిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ సుశీలాదేవి, సూపర్‌వైజర్ విక్టోరియా రాణి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎం వెంకటేశ్వరనాయక్, కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారది అన్నారు. మండలంలోని శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలలో బుధవారం చెడువ్యసనాలు, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాలికలపై లైంగిక వేధింపులు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈగల్ క్లబ్ ఆవశ్యకత, బాలికలపై లైంగిక వేధింపులు, సైబర్ నేరాల గురించి వాటిని ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఇలాంటి విషయాల్లో పూర్తిస్థాయిలో చైతన్యవంతులై ఉండాలని తద్వారా సమాజానికి మేలు చేకూరుతుందన్నారు. డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరనాయక్

హనుమంతునిపాడు: స్థానిక సచివాలయ పరిధిలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, బాలికలపై లైంగిక దాడులు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీసులు లక్ష్మీదేవి, షేక్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలుర, బాలికల క్రీడా జట్ల ఎంపిక నిర్వహించారు. ఎంపికలో సుమారు 100 మంది బాల బాలికలు పాల్గొన్నారు. ఎంపికైన జిల్లా జట్టు క్రీడాకారులను ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ పద్మజ అభినందించారు. పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జిల్లా టార్గెట్ బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

బెల్ట్ దుకాణాలు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

పామూరు: మద్యం బెల్టు దుకాణాలు అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మి అన్నారు. ఐద్వా 8వ మండల మహాసభ బుధవారం స్థానిక శారద విద్యాలయంలో కె.భానుమతి అధ్యక్షతన నిర్వహిచంచారు. ఈ సందర్భంగా షమ్మీ మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులను జోరుగా కొనసాగిస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. మహిళలు సమస్యలను ఐక్యంగా ఎదుర్కొవాలని, గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాల ద్వారా అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఐద్వా జిల్లా నాయకురాలు ఊసా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఐక్యమైతే దేన్నైనా సాధించగలమన్నారు. ఉపాధి హామీ పనులు ఆపడం వల్ల మహిళలకు కుటుంబాన్ని నడపడం కష్టంగా మారిందన్నారు. ఉపాధి లేక యువత ఇతర ప్రాంతాలకు వసత పోతున్న దయనీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఐద్వా నాయకులు మదారమ్మ, ఖాదరున్నీసా పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మి

ఫిర్యాదులపై తక్షణం స్పందించండి


మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరిరూరల్: మున్సిపాలిటీలోని వార్డుల్లో నీటి, విద్యుత్ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్, సచివాలయ సిబ్బంది తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని కమిషనర్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం మున్సిపల్, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వార్డుల్లో నీటి సరఫరా లైన్‌లను పరిశీలించి లీకులు లేకుండా చేసి, కలుషితం కాకుండా చేసి, ప్రజలకు పరిశుద్ధ జలాలను అందించాల్సిన బాధ్యత ఎమినిటి సెక్రటరీలదేనన్నారు. విద్యుత్ దీపాల సమస్యలపై తక్షణం స్పందించాలని ఎనర్జీ సెక్రటరీలను ఆదేశించారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేసినా, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వివిధ పథకాల అమలుపై మెప్మా సిబ్బందితో, స్వయం సహాయక సంఘాలతో మాట్లాడారు. మహిళలకు ఆర్థిక సామాజిక డిజిటల్ అక్షరాస్యతపై తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈలు మాధవరావు, కోటేశ్వరరావు, ఎల్‌ఐ వెంటయ్య, సూపర్‌వైజర్ గాయం వెంకటరెడ్డి, మెప్మా సీఎంఎం ఎలీషా, మున్సిపల్ అధికారులు వెంకటేష్, శ్రీనివాసులు, సచివాలయ ఎమినిటీ సెక్రటరీ, ఎనర్జీ సెక్రటరీలు, ఇంజినీరింగ్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు అధికశాతం గ్రామీణులే


సాయి సుబ్బారావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కొండపి: సచివాలయాల్లో ఉద్యోగాలు పొందిన వారులో అధిక శాతం గ్రామీణ ప్రాంతాల్లో విద్యనభ్యసించిన వారేనని ఇంటర్మీడియెట్ పరీక్షల బోర్డు మాజీ కంట్రోలర్ వెంకట సుబ్బారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల పదవీ విరమణ పొందిన సాయి సుబ్బారావును ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయి సుబ్బారావు మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు ప్రారంభించి బోర్డు అత్యున్నత ఎగ్జామినేషన్ ఆఫ్ కంట్రోలర్‌గా విధులు చేపట్టే వరకు అనేక కష్టాలు ఒడిదురుకుడు ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. చిన్నితనంలో పాఠశాలకు వెళ్లి చదవాలంటే ప్రతిరోజు 14 కిలోమీటర్లు నడుస్తూ విద్యనభ్యసించానని పాత రోజులను గుర్తు చేసుకున్నారు. 5 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లలో నా సంతకం ఉందంటే అది నాకెంతో గర్వకారణమని కష్టానికి తోడు అదృష్టం కూడా ఉండాలన్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు ఆనందరావు, రంగనాయకులు శ్రీకాంత్ వర్మ, మురళి, కోటిరెడ్డి, వెంకట్ రెడ్డి, కుసుమ, ఝాన్సీ రాణి, స్వప్నలత తదితరులు పాల్గొన్నారు.